
సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 26 । మార్చి । 2025



అందని అ'ధనం'

వంశధార నిర్వాసితులకు ఎదురుచూపు తప్పడం లేదు. అదనపు పరిహారం అందడం లేదు.


- IIలో



విద్యుత్ షాక్‌తో..

జిల్లాలో రెండు చోట్ల విద్యుదాఘాతాలు సంభవించాయి. ఇద్దరు మృతి చెందారు.

- IIలో



ఇఫ్తార్	సహార్
బుధ(సా)	గురు(ఉ)
6.10	4.38

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల (బాలికలు/బాలురు) 2025–2026 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఏప్రిల్ 6న జరగాల్సిన పరీక్షలు ఏప్రిల్ 13 నాటికి వాయిదా పడినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా సమన్వయాధికారి ఎన్.బాలాజీ తెలిపారు. విద్యార్థులు పరీక్షల్లో మార్పులు గమనించాలని. సందేహాలు ఉంటే 9701736862 – 8331005217 – 08942-279926 నంబర్లను సంప్రదించాలన్నారు.

నాటుసారాతో దొరికిన టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు



కుంబరినౌగాం ఎంపీటీసీ సింహాద్రి జన్ని

కంచిలి: కుంబరినౌగాం టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు సింహాద్రి జన్ని నాటుసారాతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. సింహాద్రి జన్ని ఇంట్లో 5 లీటర్ల నాటుసారా నిల్వ ఉందని సమాచారం రావడంతో సోంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.బేబీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. ఈ విషయమై సిఐ బేబీ మాట్లాడుతూ.. నాటుసారా అమ్ముతున్నారని సమాచారం రావడంతో దాడిచేసి పట్టుకుని కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని తెలిపారు.

తొలిరోజు ఏపీపీఎస్సీ పరీక్షలు ప్రశాంతం



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) మూడు విభాగాల పోస్టులకు సంబంధించిన నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఎచ్చెర్ల శివాని ఇంజనీరింగ్ కాలేజీ పరీక్ష కేంద్రం వద్ద భద్రత, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాలు, పరీక్షలు జరుగుతున్న తీరు తెన్నులను మంగళవారం పరిశీలించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌లో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, విశ్లేషకుడు గ్రేడ్-ఐఐ, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులకు మార్చి 25 నుంచి 27 వరకు పరీక్షలు జరుగనున్నాయి. శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఎచ్చెర్లలో జరిగిన పరీక్షకు ఉదయం సెషన్‌లో 100 మంది విద్యార్థులకు గాను 50 మంది గైర్హాజరయ్యారు. సాయంత్రం సెషన్‌లో 68 మంది విద్యార్థులకు గాను 41 మంది గైర్హాజరయ్యారు. శ్రీ శివాని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, చిలకపాలెంలో జరిగిన పరీక్షకు ఉదయం సెషన్ లో 124 మంది విద్యార్థులకు గాను 56 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 69 మంది విద్యార్థులకు గాను 31 మంది గైర్హాజరయ్యారు. కోర్ టెక్నాలజీ నరసన్నపేటలో జరిగిన పరీక్షకు 319 మంది విద్యార్థులకు గాను 171 మంది గైర్హాజరయ్యారు.

జాబ్‌మేళా నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 26న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పలాసలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉదయం 9.30నుంచి సాయంత్రం 4 గంటల వరకు మేళా జరుగుతుందని పేర్కొన్నారు. ఫ్యూషన్ ఫైనాన్స్ కంపెనీలో రిలేషన్‌షిప్ ఆఫీసర్, శ్రీసిటీలోని బ్లూస్టార్ కంపెనీలో ఆపరేటర్, శ్రీసిటీలోని యూనికార్న్ కంపెనీలో ఆపరేటర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్లు, ధ్రువపత్రాలతో హాజరుకావాలని, పూర్తి వివరాలకు 81065 08318 నంబరును సంప్రదించాలని కోరారు.

27న పరిశ్రమల అవగాహన సదస్సు



శ్రీధర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కోసం మేధో సంపత్తి హక్కులపై ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి ఎచ్చెర్ల అంబేడ్కర్ యూనివర్సిటీలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ బ్యాంకు సహాయంతో రాంప్ పథకం కింద ఏపీఎంఎస్ఎంఈ స్పాన్సర్ చేసిన ఈ కార్యక్రమాన్ని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ జిల్లా పరిశ్రమల కేంద్రం సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ యజమానులు, ఉద్యోగులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, పరిశోధకులు హాజరుకావచ్చని, ముందుగా డాక్టర్ గద్దం సుదర్శన్ (9494959108)ని సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.



పోలవరం గ్రామంలో సిరిమానోత్సవం ముగింపులో సిరిమానుతో భక్తజనం




పోలవరం గ్రామంలో సిరిమానోత్సవం ముగింపులో ముర్రాటలు, ఘటాలతో భక్తుల ఊరేగింపు

సిరి సంబరం.. మురిసిన పోలవరం

పాశిపోలమ్మ సిరి సంబరంతో పోలవరం మురిసిపోయింది. మంగళవారం వేలాది మంది భక్తజనుల మధ్య గ్రామంలో సిరిమానోత్సవం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవంతో ఐదు రోజుల సంబరం ముగిసింది. ఈ సందర్భంగా ఒడిశా కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు, గ్రామస్తుల ముర్రాటల నడుమ సిరిమానును గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపు అనంతరం పాశిపోలమ్మ కొలువైన రావిచెట్టు వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించారు.

–టెక్కలి



ఎమ్మెల్యే చెబితేనే..

ఆ లేఖ ఉంటేనే బదిలీ, ఆ లేఖ ఉంటేనే పోస్టింగు, ఆ లేఖ ఉంటేనే అన్ని పనులు. కూటమి ప్రభుత్వం తన రూటే సెప'రేటు' అనిపించుకుంటోంది. ఉద్యోగుల బదిలీకి ఎమ్మెల్యే సిఫార్సు లేఖలను తప్పనిసరి చేసింది. దీంతో అధికారులు, ఉద్యోగులు ఆపసోపాలు పడుతున్నారు. కోరుకున్న చోటుకు వెళ్లడానికి ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ ఆమదాలవలస అంటే మాత్రం హడలిపోతున్నారు.

డ్వామా.. సిఫార్సుల చిరునామా

- ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఉంటేనే పోస్టింగ్
- డ్వామా బదిలీల్లో సరికొత్త సంస్కృతి
- ఎమ్మెల్యే లేఖ తప్పనిసరి అంటున్న అధికారులు
- అధికారుల తీరుతో ఉపాధి హామీ ఉద్యోగుల్లో ఆందోళన
- ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్న ఉపాధి ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం ఉద్యోగుల బదిలీల్లో సరికొత్త సంస్కృతికి నాంది పలుకుతోంది. ఉద్యోగుల బదిలీల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా సిఫార్సు లేఖల సంస్కృతిని తెరపైకి తెచ్చింది. దీంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈనెల 20వ తేదీన జిల్లా కేంద్రంలోని డ్వామా కార్యాలయంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ (ఉపాధి హామీ) పథకంలో పనిచేస్తున్న ఎపీఓ, ఇంజినీరింగ్ కన్సల్టింగ్ (ఈసీ), టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ), కంప్యూటర్ ఆపరేటర్లు (సీఓ) తదితర ఉద్యోగుల బదిలీలను నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కానీ ఈ బదిలీల్లో ఎమ్మెల్యేలు కలుగజేసుకుంటున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఉంటేనే మీరు కోరుకున్న చోటు లభిస్తుందని డ్వామా అధికారులు చేతులెత్తేయటంతో ఉపాధి హామీ పథకం ఉద్యోగులు గత ఐదు రోజులుగా జిల్లాలోని ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు చేయాల్సిన బదిలీలను ఎమ్మెల్యేలు చేతుల్లోకి తీసుకున్నారని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.

ఒక ఉద్యోగి.. మూడు మండలాలు

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఏపీఓలు ఇప్పుడు పనిచేస్తున్న క్లస్టర్‌లో ఉండకూడదని పక్క క్లస్టర్‌కు వెళ్లాలని, ఈసీ, టీఏ, సీఓ వంటి మిగిలిన ఉద్యోగులు వారి సొంత మండలాల్లో ఉండకుండా పక్క మండలాలకు వెళ్లాలని అధికారుల నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఈ నిబంధనల ప్రకారం ప్రతి ఉద్యోగి వారికి నచ్చిన మూడు మండలాలను ఎంపిక చేసుకోవచ్చని సూచించారు. దీంతో ఉద్యోగులు వారికి నచ్చిన మూడు మండలాలను ఎంపిక చేసుకుని డ్వామా అధికారులకు వారి అంగీకారాన్ని తెలియజేశారు. బదిలీలు సజావుగా జరిగిపోతాయనుకున్న సమయంలో ఎమ్మెల్యే సిఫార్సు లేఖ అంటూ సరికొత్త సంస్కృతి తెర మీదకు రావటంతో రాజకీయ నాయకులతో పాటు ఎమ్మెల్యేల కార్యాలయాలు చుట్టూ ఉద్యోగులు తిరుగుతున్నారు.

ఆమదాలవలస అంటే హడల్..

జిల్లాలో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం ఉద్యోగుల్లో ఒక భయం వెంటాడుతోంది. ఆమదాలవలస నియోజకవర్గం అంటే హడలిపోతారు. అక్కడ పనిచేయాలంటే భయమని చెబుతారు. ఈ నియోజకవర్గంలో ఉన్న మండలాల్లో ఎక్కడ పనిచేసినా చిన్న విషయాన్ని కూడా రాజకీయం చేస్తారని, ప్రతి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి తమను దోషులుగా నిలబెడతారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

సిఫార్సు లేఖ లేకుంటే..?



బదిలీ కోసం ఎమ్మెల్యే సిఫార్సు లేఖ లేకుంటే ఉద్యోగి పరిస్థితి ఏమిటా..? అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అనేక మంది ఉద్యోగులు ఎమ్మెల్యేల వద్ద నుంచి సిఫార్సు లేఖలు తీసుకుని వారి వారి ప్రయత్నాలు ప్రారంభించి డ్వామా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీన్నే కొందరు ఎమ్మెల్యేలు క్యాష్ చేసుకుంటున్నారు. బదిలీల సిఫార్సు లేఖల ముసుగులో చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పైరవీలకు తావిచ్చేలా అధికారులు సూచించడంతో ఉపాధి హామీ పథకం ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఎమ్మెల్యేలు లేఖలు ఇచ్చారంటే భవిష్యత్‌లో వారు చెప్పినట్లు తప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంటుందని అంతర్మథనం చెందుతున్నారు.

రంజాన్ విశిష్టతపై కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: ముస్లిం రచయితల సంఘం (మురసం) వ్యవస్థాపకులు కరీముల్లా పిలుపు మేరకు రంజాన్ విశిష్టత అనే అంశంపై కవితలకు ఆహ్వానం పలుకుతున్నట్లు మురసం సంయుక్త కార్యదర్శి మహ్మద్ రఫీ(ఈవేమన) ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల కవులు, రచయితలు ఎవరైనా తమ కవితలను 7893451307, 9492265054 వాట్సాప్ నంబర్లకు ఈనెల 30వ తేదీలోగా పంపాలని కోరారు. రంజాన్ రోజున 3గంటలకు గూనపాలెంలోని శాంతినికేతన్ కళాశాల డైరెక్టర్ సురంగి మోహనరావు అధ్యక్షతన కవి సమ్మేళనం జరుగుతుందని తెలిపారు.

డీఈఓ తీరుపై టీచర్ల మండిపాటు



భారీ సంఖ్యలో ర్యాలీగా వస్తున్న ఉపాధ్యాయులు

కుప్పిలి మాస్ కాపీయింగ్ ఘటన

- జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయుల భారీ ర్యాలీ
- టీచర్ల సస్పెన్షన్‌లు రద్దు చేయాలని డిమాండ్

శ్రీకాకుళం న్యూకాలనీ: కుప్పిలి మాస్ కాపీయింగ్ ఘటనలో డీఈఓ తీరును నిరసిస్తూ టీచర్లు మంగళవారం భారీ ఎత్తున జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. డీఈఓ తిరుమల చైతన్యను వెంటనే సస్పెండ్ చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో వైఎస్సార్ సర్కిల్ వద్ద మొదలైన ఈ ర్యాలీ జీటీరోడ్, సూర్యమహల్ మీదుగా డీఈఓ కార్యాలయం వద్దకు చేరుకుంది. అక్కడ నిరసన చేపట్టారు. ముందుస్తుగా పోలీసులు మోహరించడంతో డీఈఓ కార్యాలయం లోపలకు అనుమతించలేదు. జిల్లా పరువును, ప్రతిష్టను జిల్లా విద్యాశాఖాధికారిగా తిరుమల చైతన్య మంటగలిపారని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు కొప్పల భానుమూర్తి, గొంటి గిరిధర్, తంగి మురళీమోహన్, చౌదరి రవీంద్ర, పిసిని వసంతరావు, మజ్జి మదన్‌మోహన్, దుంపల శివరామ్‌ప్రసాద్, ఎస్వీ రమణమూర్తి, బలివాడ ధనుంజయరావు, ఎంవీ రమణ, గురుబెల్లి దామోదరరావు, సూర పాపారావు, తదితరులు ఆరోపించారు. కుప్పిలిలో డీబారైన విద్యార్థులు, తల్లిదండ్రులు, సస్పెండైన టీచర్లు సైతం ఈ ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థుల డీబార్లను రద్దు చేసి, వారికి న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్, మంత్రి అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లను కలిసి విషయాన్ని తెలియజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు బొడ్డేపల్లి గోపీచంద్, రమణ, బి.భాస్కరరావు, సూర స్వర్ణకుమారి, బి.వెంకటేశ్వరరావు, శ్రీరామ్మూర్తి, దామోదరరావు, ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, తంగి రాజారావు, శ్రీనివాసరావు, పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మార్చి 26 సాయంత్రం 4 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులతో భారీ ధర్నా నిర్వహించనున్నారు. 27 సాయంత్రం 4 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నారు, అలాగే మార్చి 29న సాయంత్రం 4 గంటలకు డీఈఓ కార్యాలయం ముట్టడి, ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియను బహిష్కరిస్తామని పేర్కొన్నారు.



మండల రెవెన్యూ సిబ్బందితో సమీక్షలో నోడల్ ఆఫీసర్ పద్మావతి

55,146 అర్జీలకు పరిష్కారం

కవిటి: పీపుల్ గ్రీవెన్సెస్ రీఅడ్రస్సల్ సిస్టం(పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా 30 మండలాల పరిధిలో ఇప్పటి వరకు 55,146 అర్జీలకు నిబంధనల మేరకు పరిష్కారం చూపగలిగామని పీజీఆర్ఎస్ నోడల్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి అన్నారు. మంగళవారం ఆమె కవిటి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లాగిన్‌లో ఏ మేరకు పీజీఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్న అంశాన్ని తనిఖీ చేసి తక్కువ పెండింగ్ ఉన్న మండలంగా గుర్తింపు సాధించడంపై తహసీల్దార్ మురళీమోహనరావును ఆమె అభినందించారు. 1866 దరఖాస్తులు ఇన్‌ప్రొగ్రెస్ జాబితాలో ఉన్నాయని తెలిపారు.

శ్రీకూర్మనాథుని హుండీ ఆదాయం రూ.15.15 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథాలయ హుండీలను తెరచి లెక్కించగా రూ.15,15,396 ఆదాయం వచ్చిందని గ్రూప్ టెంపుల్స్ ఈఓ పి.శ్యామలరావు తెలిపారు. 62 రోజులకు గాను శ్రీకూర్మనాథాలయంలోని హుండీలతో పాటు సమీప ఆలయ హుండీలను తెరచి లెక్కించడం జరిగిందని తెలిపారు. సేవకులుగా స్థానికులతో పాటు సమీప గ్రామాల వ్యక్తులు లెక్కింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈఓ జి.గురునాథం, ఆలయ ప్రధానార్చకులు సీహెచ్ సీతారామనృసింహాచార్యులు, శ్రీ భాష్యం పద్మనాభాచార్యులు, నర్సుబాబు, పీసీ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హుండీ కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న భద్రాజీ, ప్రసాద్ పట్నాయక్

ఆదిత్యుని హుండీ ఆదాయం రూ.61.93 లక్షలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కించారు. రూ.61,93,916 ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలియజేశారు. జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్ పట్నాయక్ సమక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపులో నగదు రూపంలో రూ.59,18,645, చిల్లర రూపంలో రూ.2,75,271 వరకు ఆదాయం లభించింది. అలాగే 28 గ్రాముల బంగారం, 2 కేజీల 400 గ్రాముల వెండి వస్తువులు కూడా కానుకల రూపంలో హుండీల్లో లభించినట్లుగా ఈఓ తెలిపారు.



త్రిశూలధారిణే నమః

శ్రీకాకుళంలోని పెద్దరెల్లివీధిలో నూకాలమ్మ తల్లి మాలధారులు మంగళవారం శూలధారణతో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు పెద్దరెల్లివీధి నుంచి కలెక్టర్ బంగ్లా రోడ్డులోని నక్కవీధి వద్ద ఉన్న నూకాలమ్మతల్లి ఆలయం వరకు జరిగింది. అనంతరం గుడి ప్రాంగ్రణం వద్ద అగ్నిగుండం తొక్కి మొక్కులు చెల్లించుకున్నారు. – శ్రీకాకుళం కల్చరల్, సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

28న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



కాశీబుగ్గ: దివ్యాంగులకు ఉచితంగా ఈనెల 28న ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్టు మదర్ చారిటబుల్ ట్రస్ట్ (దివ్యాంగుల సేవా కేంద్రం)సొండిపూడి వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారెడ్డి భాస్కరరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ఉన్న దివ్యాంగులకు వివిధ రకాలైన ఉచిత ఉపకరణాలు ఇస్తామని అన్నారు. చంక కర్రలు, బ్లైండ్ స్టిక్, వినికిడి యంత్రాలు, చక్రాల కుర్చీ, వాకింగ్ వాకర్స్, సింగల్ వాకింగ్ స్టిక్స్, కృత్రిమ కాళ్లు, చేతులు, పోలియో వారికి కాలిపర్స్ వంటి ఉపకరణాలు ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఈనెల 27 తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోగా అభ్యర్థి పూర్తి వివరాలు 9989371952 ఫోన్ నంబర్‌కు వాట్సాప్‌లో గాని ఫోన్ చేసి గానీ తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. నమోదు చేసుకున్న వారికి మరుసటిరోజు 28 తేదీన ఉపకరణాలు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

వేలం పాడుకో.. నచ్చినంత దోచుకో

ఇచ్ఛాపురం టౌన్:

మున్సిపాలిటీలో ఆశీలు వ్యాపారం మూడుపువ్వులు ముప్పై కాయలుగా సాగుతోంది. మున్సిపాలిటీలో 23 వార్డుల్లోని ప్రభుత్వ స్థలాలు, బహిరంగ ప్రదేశాలు, రోడ్ల పక్కన ప్రదేశాల్లో పంటలు అమ్మినా, చిన్న బడ్డీ కొట్టు పెట్టినా మున్సిపాలిటీకి ఆశీలు చెల్లించాలి. ఈ పన్నుల వసూలుకు ఏడాదికి ఓ సారి వేలం నిర్వహిస్తారు. ఈ పన్నులకు సంబంధించి ధరల బోర్డు బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శించాలి. కానీ ప్రదర్శించడం లేదు. రశీదులు కూడా ఏదో కొద్దిమందికే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అధికారుల తనిఖీలు కూడా కానరావడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు ఇదే అదనుగా దోచుకుంటున్నారు.

ధరల బోర్డు పెడతాం

ఆశీలుకు సంబంధించి ధరల బోర్డు బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. ఆశీలు వసూళ్లపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తామన్నారు.



బజారులో షాపులు

క్లుప్తంగా

ఉగాది పురస్కారాలకు ఎంపిక

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి ఆదిత్యానగర్ కాలనీలోని మణిపాత్రుని క్రియేటివ్ అకాడమీ (ఎంసీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 30న విశ్వావసు నామ ఉగాది పురస్కారాలను వివిధ రంగాలలో ప్రముఖులకు అందజేస్తున్నట్లు నిర్వాహకులు భాగ్యలక్ష్మి, నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాలరంజని సంస్థ ఆధ్వర్యంలో వివిధ నైపుణ్యాలలో ప్రతిభ సాధించిన బాలలకు పురస్కారాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.వాండ్రంగి కొండలరావు (సాహిత్యరత్న), బద్రి కూర్మారావు (సేవా రత్న), కంటు మురళీగోవింద్ (నాట్యరత్న), ఎర్రపాటి అప్పారావు (నటరత్న), నేరెళ్ల సత్య నారాయణ (గానరత్న), ఆచింటు లక్ష్మణరావు (వాయిద్యరత్న), వడగ సుబ్రహ్మణ్యం (హరిక థారత్న), ఇంజరాపు మోహన్‌రావు (వైద్యర త్న), యాపార శ్రీనివాస్ (యువ సేవారత్న), ఎలినాటి ధరణి (బాలరత్న–కోలాటం), బి.సన్నిహిత్ (బాలరత్న–చిత్రలేఖనం), ఎం .లిప్సి శ్రీవల్లి జయదేవ్‌కుమార్ (కూచిపూడి, సంగీతం), శ్రీకాకుళం చిట్టి (బాలరత్న– ఇన్‌స్టాగామ్), బిన్నాడ దీక్షిత్ (శ్లోకపఠనం)లకు పురస్కారాలు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. అదే విధంగా, నగరంలోని సాహితీ చైతన్య కిరణాలు అధ్యక్షుడు ఉమాక వికి నెల్లూరుకు చెందిన ప్రాచీన తెలుగు విశిష్ట ధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారానికి ఎంపికైనట్లు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 27న ఉదయం ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్నాయి. అదే రోజు సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తారు. ఏడాదికోసారి జరిగే ఈ ఎన్నికలకు సంబంధించి కార్యదర్శి, కోశాధికారి, క్రీడా, లైబ్రరీ కార్యదర్శుల పోస్టులకు ఒకే నామినేషన్ పడటంతో ఏకగ్రీవమయ్యాయి. కార్యదర్శిగా మోటూరి భవానీప్రసాద్, కోశాధికారిగా కొమర శంకరరావు, లైబ్రరీ కార్యదర్శిగా కొమ్ము రమణమూర్తి, క్రీడా కార్యదర్శిగా త్రిపురాన వరప్రసాదరావు ఎన్నికయ్యారు. మిగిలిన పదవులకు ఎన్నిక జరగనుంది.

ఉప సర్పంచ్‌పై చర్యలకు వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నరసన్నపేట పంచాయతీ పాలక మండలి సభ్యులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంతో గెలిచి మరో పార్టీలో చేరి ఇప్పుడు మేజర్ పంచాయతీ పరిపాలనకు ఆటంకంగా మారిన నరసన్నపేట మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబుపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ పాలకవర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం రెవెన్యూ డివిజినల్ అధికారి సాయి ప్రత్యూషకు ఫిర్యాదు చేశారు. ఉపసర్పంచ్‌పై పాలకవర్గంలోని 16 మంది సభ్యుల సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మాన నోటీసును అందజేశారు. ఆర్డీఓను కలిసిన వారిలో మాజీ ఉపసర్పంచ్, ప్రస్తుత వార్డు మెంబర్ కోరాడ చంద్రభూషణ గుప్తా, మెంబర్లు వార్డు రఘు పాత్రుని శ్రీధర్, బంకుపల్లి శర్మ, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళీధర్, జెడ్పీటీసీ చింతు రామారావు, మాజీ చైర్మన్ రాజాపు అప్పన్న, ఎంపీటీసీ బగ్గు రమణయ్య, నేతింటి రాజేశ్వర రావు, మాజీ డైరెక్టర్ బబ్బోది ఈశ్వరరావు, సతివాడ రామినాయుడు, తోట భార్గవ్ తదితరులు ఉన్నారు.

27న వర్సిటీలో క్యాంపస్ డ్రైవ్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో ఈ నెల 27న ముత్తూట్ గ్రూఫ్ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్లేస్‌మెంట్ అధికారి విద్యాసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వంద పీవోలు, ఇతర ఉద్యోగాల నియామకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఎంబీఏ 60 శాతం, ఎం.కాంలో 70 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 8247630064 నంబరును సంప్రదించాలని కోరారు.

అందరికీ అందని అధనం


వంశధార నిర్వాసితుల కోసం నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఇదే

- వంశధార నిర్వాసిత కాలనీకి భూములు ఇచ్చిన రైతులకు తప్పని ఎదురుచూపులు
- అధికారుల నిర్వాకం కారణంగా అదనపు పరిహారానికి నోచుకోని వైనం
- న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత రైతులు

ఆమదాలవలస రూరల్: కొంతమంది అధికారుల నిర్లక్ష్యం.. భూములు అందజేసిన రైతుల పాలిట శాపంగా మారింది. తమ తోటి రైతులు అదనపు పరిహారం అందుకున్నా తమకు మాత్రం అందకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై కార్యాలయాలు, అధికారుల చుట్టూ ఎన్నిసార్లు ప్రదక్షిణాలు చేస్తున్నా కాలయాపన చేస్తున్నారు తప్ప న్యాయం చేయడం లేదని వాపోతున్నారు. తరతరాలుగా పచ్చని పంటలు పండించే భూములు ఎంతో ఉదారతమైన ఆశయంతో ప్రభుత్వానికి అప్పగిస్తే తమకు ఇలా చేస్తారా అంటూ మండిపడుతున్నారు. వంశధార రెండో దశ నిర్వాశితుల కాలనీ కోసం భూములు అందించిన పలువురు రైతులకు అదనపు పరిహారం అందక కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

హిరమండలం రిజర్వాయర్ కోసం తులగాం గ్రామంలో సర్వం కోల్పోయిన బాధితుల కోసం ప్రభుత్వం ఇళ్లు నిర్మించేందుకు ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస గ్రామంలో సంగమేశ్వర ఆలయం వద్ద సుమారు 115 ఏకరాలు భూమిని గుర్తించారు. ఇందులో రైతుల వద్ద నుంచి సుమారు 100 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఒక్కో బాధిత కుటుంబానికి ఐదు సెంట్ల స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఈ కాలనీ కోసం భూములు ఇచ్చిన రైతులకు రూ.5,25,000 పరిహారం కింద 2009లో అప్పటి ప్రభుత్వం అందజేసింది. అయితే ఈ పరిహారం ఏ మాత్రం చాలకపోవటంతో 2022లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎకరాకి రూ.1,00,000 చొప్పున అదనపు పరిహారం అందించాలని నిర్ణయించారు.దీ మేరకు రైతుల ఖాతాల్లో జమ చేశారు.

అధికారుల నిర్వాకం..

అధికారులు చేసిన తప్పులు కారణంగా సుమారు 30 మంది బాధిత రైతులు అదనపు పరిహారానికి నోచుకోలేకపోయారు. రెవెన్యూ శాఖ నుంచి భూసేకరణ శాఖకు పంపాల్సిన బాధితుల జాబితాలో బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఐ.ఎఫ్.ఎస్‌సి.కోడ్, ఆధార్ నంబర్ వంటివి తప్పుగా నమోదు చేయటంతో బాధితులకు ఇంతవరకు అదనపు పరిహారం అందని ద్రాక్షగానే మిగులుతోంది. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు న్యాయం జరగలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయం చేస్తాం..

ఈ విషయమై ఆమదాలవలస తహశీల్దార్ ఎం.రాంబాబు వద్ద 'సాక్షి' ప్రస్తావించగా.. అదనపు పరిహారం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. బాధితులకు తగిన న్యాయం చేస్తామని చెప్పారు.

ఫిర్యాదు చేసినా..



అదనపు పరిహారం అందలేదని కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశాం. ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా అదనపు పరిహారం అందలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించిన అదనపు పరిహారం అందించి న్యాయం చేయాలి. – **చింతాడ దమయంతి, శ్రీహరిపురం, ఆమదాలవలస మండలం**

రాజకీయ కారణాలతోనే..



కొందరు అధికారులు, సిబ్బంది తీరు కారణంగా ఇంతవరకు పరిహారం అందలేదు. రాజకీయ కారణాలతోనే జాప్యం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా పరిహారం అందలేదు. – **పొలం శ్రీనివాసరావు, గాజులకొల్లివలస, ఆమదాలవలస మండలం**

అన్యాయం..



నిర్వాసిత కాలనీకి భూములు అందజేసిన బాధితులకు అదనపు పరిహారం ప్రకటించినా రెవెన్యూ సిబ్బంది వివరాలు తప్పుగా నమోదు చేయటం వల్ల ఇంతవకు పరిహారం అందలేదు. భూములు కోల్పోయి రోడ్డున పడ్డ బాధితులను ఇప్పటికై నా ఆదుకోవాలి. – **లంక అప్పలరాజు, గాజులకొల్లివలస, ఆమదాలవలస మండలం**

● ఆదిత్యుని పరిసరాల్లో 'ఆక్టోపస్'





ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంపై భవిష్యత్‌లో ఉగ్రవాదుల దాడి జరిగితే.. భారీ విపత్తు సంభవిస్తే.. ఎలా ఎదుర్కోవాలనే కోణంలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆక్టోపస్ బృందాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఈ సందర్భంగా అరసవల్లి ఆలయ పరిసర వీధుల్లో సందడి నెలకొంది. వన్‌టౌన్ ఎస్సై హరికృష్ణ తదితరులు బందోబస్తు నిర్వహించారు.

– అరసవల్లి

అండగా ఉంటాం.. అధైర్యపడవద్దు


సీఐకు వినతిపత్రం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్/ఇచ్ఛాపురం టౌన్: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, కక్షపూరిత దాడులతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అధైర్యపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు భరోసా ఇచ్చారు. మంగళవారం ఎంపీపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే తరచూ కార్యకర్తలపై దాడులు, ఆస్తుల ధ్వంసం, వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు సంక్షేమ పథకాలు నిలుపుదల, అధికారులతో ఒత్తిడికి గురి చేస్తున్నారని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రామారావు, విజయ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని, కూటమి ప్రభుత్వం మాత్రం సొంత కార్యకర్తలకు పెద్దపీట వేయడం దారుణమన్నారు. ఈ విధానాలపై ప్రతిఒక్క కార్యకర్త గళమెత్తాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల మశాఖపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త కె.భీమారావుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మూకుమ్మడిగా దాడి చేయడంతో మంగళవారం బాధితుడిని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు, వివక్షలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐ ఎం.చిన్నంనాయుడికి వినతిపత్రం అందించారు. రౌడీషీట్లు ఓపెన్‌చేస్తామని బెదిరిస్తున్నారని, మహిళలతో అగౌరవంగా మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మండల పార్టీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంపీపీ బోర పుష్ప, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సల్ల దేవరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రణస్థలం: మండలంలోని బంటుపల్లి రాధాగోవింద మందిరం సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఎస్వీ రమణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న లారీని వెనుక నుంచి ద్విచక్రవాహనంతో వచ్చిన రమణ బలంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన రమణను 108 అంబులెన్సులో శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉంది. కొవ్వాడ గ్రామానికి చెందిన రమణ పైడిభీమవరం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ ఘటనపై ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురుగాలుల బీభత్సం


నేలమట్టమైన స్వీట్‌కార్న్ పంట వద్ద రైతు

పాతపట్నం: మండలంలోని కొదూరు పంచాయతీ ప్రహరాజపాలెం సమీపంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా భారీ గాలులు వీయడంతో రైతులు రావాడ వెంకటరావు, ప్రసాద్ మహంతి, జాడ నవరయ్య, చిప్పాడ నారాయణ, మంత్రి సోమేష్, మంత్రి లచ్చయ్య, రావాడ రవికిరణ్, కుంబుమహంతి వేణుగోపాల్‌కు చెందిన ఐదు ఎకరాల స్వీట్ కార్న్ పంట నేలకొరిగింది. మరో పది రోజుల్లో పంట చేతికి వచ్చేదని, ప్రభుత్వం స్పందించి పరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో అటెండర్ మృతి

- శ్రీకాకుళం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఘటన
- కల్లాడలో విషాదఛాయలు

అరసవల్లి: ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఎస్ఈ కార్యాలయం నీటి కోసం మోటార్ స్విచ్ వేయడానికి వెళ్లిన కార్యాలయ అటెండర్ మల్లారెడ్డి ఆనంద రావు(47) విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో అందరూ విధుల్లో ఉండగా ఈదుర్ఘటన జరగడంతో ఇటు ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు, అటు జిల్లా పరిషత్ పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు నిర్ఘాంత పోయారు. సమాచారం తెలిసిన వెంటనే జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజా ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉదయం మోటార్ వేయడానికి వెళ్లి ఇంకా రాలేదని మరో అటెండర్ శార్వాణి వెళ్లినప్పటికే అచేతనంగా ఆనందరావు పడి ఉండటంతో మిగిలిన సిబ్బందికి సమాచారాన్ని అందించింది. 108 వాహనం సిబ్బంది వచ్చేసరికే మృతి చెందినట్లు వారు ధృవీకరించారు.వన్‌టౌన్ ఎస్సై హరికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. స్థానిక దేశెల్ల వీధిలో నివాసముంటున్న ఆనంద రావు స్వస్థలం నందిగాం మండలం కల్లాడ గ్రామం. భార్య దుర్గ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆనందరావు మృతి పట్ల జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, జెడ్పీ చైర్‌పర్సన్ కార్యాలయ సీసీ అప్పన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రంగప్రసాద్, డీఈ లలితకుమారి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మరో ఘటనలో..


మణికుమార్(ఫైల్)

బూర్జ: మండలంలోని చీడివలస గ్రామానికి చెందిన బూరి మణికుమార్ (18) విద్యుత్ షాక్‌కు గురై మంగళవారం మృతి చెందాడు. మామయ్య నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఇంటి గోడలను నీటితో తడుపుతూ ఇనుప నిచ్చెన తీస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసేసరికే మృతిచెందాడు. మణికుమార్‌కు తల్లిదండ్రులు దుర్గారావు, కేసరి, సోదరి ఉన్నారు. చేతికందిన కుమారుడు విద్యుత్ షాక్‌కు గురికావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా


మెళియాపుట్టి మీదుగా ఇసుకను తీసుకెళ్తున్న ఒడిశా ట్రాక్టర్లు

- ఒడిశాకు రాత్రివేళల్లో తరలించుకుపోతున్న వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

మెళియాపుట్టి: కూటమి ప్రభుత్వం ప్రటించిన ఉచిత ఇసుక విధానం కొంతమందికి కాసులు కురిపిస్తోంది. పగటి పూట అధికారులు దాడులు చేస్తారని భావించి రాత్రివేళల్లో ఒడిశా వంటి ప్రాంతాలకు దర్జాగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. హిరమండలం, ఎల్ఎన్‌పేట, కొత్తూరు మండలాల నుంచి ఇసుకను పాతపట్నం మీదుగా ఆల్ ఆంధ్రా రహదారిలో మెళియాపుట్టి గ్రామ వీధుల్లో నుంచి ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. గతంలో ఇసుక అక్రమ రవాణాపై మీడియాలో కథనాలు రావడంతో రెవెన్యూ అధికారులు రూ.2000 చొప్పున అపరాధ రుసుం విధించారు.

తర్వాత వారిని వదిలేయడంతో ఇసుక దొంగలు రెచ్చిపోతున్నారు. ప్రతి రోజూ సాయంత్రమైతే పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను ఒడిశాకు తరలిస్తున్నారు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

అడ్డుకుంటాం..

గతంలో ఇదేవిధంగా చేస్తే ఒడిశా బోర్డర్ వద్ద మా సిబ్బందితో కలిసి పరిశీలన చేయించాం. ఇసుక తరలిస్తున్న వారిని వీఆర్వోలు అడ్డుకున్నా ఆపకుండా వెళ్లిపోయారు. ఇప్పుడు రాత్రివేళల్లో, సెలవురోజుల్లో తరలిస్తున్నట్లు తెలిసింది. పోలీసుల సాయంతో అడ్డుకుంటాం..

– పాపారావు, మెళియాపుట్టి తహసీల్దార్

కట్టడి చేస్తాం..

ఇదివరకే మహేంద్రతనయ నదీ తీరంలో నిఘా పెట్టాం. మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా మావంతు చర్యలు తీసుకుంటున్నాం.

– రమేష్ బాబు, మెళియాపుట్టి ఎస్సై

పోక్సో చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న న్యాయమూర్తి భాస్కరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిన్నారులను లైంగిక వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం ఒకటో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి పి.భాస్కరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీ 4వ లైన్‌లో ట్రైబల్ హాస్టల్‌ల్లో పిల్లలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం–పోక్సోపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల పట్ల అనేక నేరాలు జరుగుతున్నాయని చెప్పారు. అశ్లీల చిత్రాలు చూపించడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్ జి.ఇందిరాప్రసాద్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఏ.రాజారావు, ఆర్.అప్పలస్వామి, జి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

14 కేజీల గంజాయితో ముగ్గురు అరెస్టు

కాశీబుగ్గ: ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి నుంచి తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని పట్టుకున్నట్లు పలాస జీఆర్‌పీ ఎస్ఐ షరీఫ్ తెలిపారు. తమిళనాడుకు చెందిన త్యాగు, విఘ్నేష్, అజిత్‌లు మంగళవారం పర్లాఖిమిడి నుంచి గంజాయి తెప్పించుకుని పలాసలో తమిళనాడు వెళ్లే రైలు కోసం వేచి ఉండగా సీసీ కెమెరాల్లో వారి కదలికలపై అనుమానం వచ్చిన జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు వారిని తణిఖీ చేశారు. వారి వద్ద రూ.74 వేలు విలువైన 14.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో మరో ముగ్గురు అరెస్టు

ఆమదాలవలస: పట్టణంలోని కంద్రపేట వీధి వెనుక శ్మశానవాటిక గత ఏడాది అక్టోబర్ 27న ఐదు కిలోల గంజాయిని అప్పటి ఎస్ఐ కె.వెంకటేష్ నేతృత్వంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో ఏడుగురిలో నలుగురు పట్టుబడగా ముగ్గురు పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శ్రీకాకుళం నానుబాల వీధికి చెందిన తమ్మినేని సాయి, శ్రీకాకుళం దమ్మల వీధికి చెందిన మైపల్లి రాంబాబు, ఆమదాలవలస వాంబే కాలనీకి చెందిన పాలకొండ చిన్న నిందితులుగా గుర్తించి అరెస్టు చేసినట్లు ఆమదాలవలస ఎస్ఐ ఎస్.బాలరాజు తెలిపారు. నిందితులను ఆమదాలవలస సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

దాహం తీరే దారేదీ..?


నౌపడ సమీపంలో లారీ ట్యాంకులకు నీటిని నింపుతున్న దృశ్యం

సంతబొమ్మాళి: నౌపడ, మర్రిపాడు, సీతానగరం తదితర గ్రామాల్లో మూగజీవాలు దాహంతో అల్లాడుతున్నాయి. ఈ మండలాల్లో చెరువులు, సాగునీటి కాలువలు, గుంటల్లో ఉన్న నీటిని పోర్టు కోసం తీసుకెళ్లిపోతుండడంతో పశువులకు గుక్కెడు కరువైపోతోంది. మూలపేట పోర్టు పనులకు సంబంధించి కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ట్యాంకర్ల ద్వారా నీరు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ ట్యాంక్ (2వేల లీటర్లు) రూ.700లకు, లారీ ట్యాంక్ (5వేల లీటర్లు) రూ.1500లు చొప్పున రోజుకు సుమారు 100 లోడులు వరకు పోర్టుకు నీటిని తరలించుకుని వెళ్లిపోతున్నారు. చెరువులు, కాలువల వద్ద ఇంజిన్ సాయంతో ట్యాంకర్లకు నీటిని లోడింగ్ చేసి తీసుకెళ్లిపోతున్నారు. కాలువలు తవ్వి మరీ ఉన్న నీరు తోడేస్తున్నారు. దీంతో మేత కోసం తిరుగాడే మూగజీవాలకు వేసవిలో తాగేందుకు నీరు లేకుండా పోతోంది. కాపర్లు పశువులను బయటకు తీసుకువెళ్లడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పశువులను కాపాడి చెరువులు, కాలువల్లో నీరు తోడి అమ్ముకుంటున్న ప్రైవేటు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.

చర్యలు తప్పవు

ఈ విషయం నా దృష్టికి రాలేదు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతాం. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులకు కూడా తెలియజేస్తాం. –డి.హరి, డిప్యూటీ తహసీల్దార్, సంతబొమ్మాళి


సాగునీటి కాలువలో నీటిని తరలించడానికి ప్రైవేటు వ్యక్తులు తవ్విన కాలువ